క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ట

ఎర్రగుంట్ల : మండల పరిధి చిర్రాజుపల్లెలోని శ్రీ వినాయకస్వామి దేవాలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్యులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురం సమీపంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి ఆసుపత్రి)కి శుక్రవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. ఆయన చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు చికిత్సలు అందిస్తారన్నారు. చెవిలో చీముకారుట, చెవినొప్పి, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వరపేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తలతిరుగుట, తదితర సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందించనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంటల వరకు వైద్యచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆర్థిక సాయం

చింతకొమ్మదిన్నె : వీఎన్‌పల్లి మండలం ఆడవి చెర్లోపల్లి గ్రామానికి చెందిన కొప్పల గంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పరిశ్రమల సలహాదారుడు, స్విస్ట్ కళాశాల చైర్మన్ రాజోలి వీరారెడ్డి బుధవారం తను స్థాపించిన ఆర్‌వీఆర్ ఫౌండేషన్ తరపున రూ.50,000 మృతుడి కుటుంబానికి స్విస్ట్ కళాశాలలో అందించారు. మృతుడి కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజోలీ సాయిచరణ్‌రెడ్డి, సామాజిక కార్యకర్త కొప్పల ప్రహ్లాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాడి కొనుగోలుకు రుణమేళా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు పాడిసంరక్షణ, పాడి కొనుగోలు కోసం రుణాలు ఇచ్చేందుకు బుధవారం హిమకుంట్లలో లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ, ఏపీడీడీసీఎఫ్ మేనేజర్ వెంకటేశ్వరిలు మాట్లాడుతూ పాడి రైతులు పాడిపశువుల పోషణ కొరకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తాయన్నారు. పాడిరైతులు జగనన్న పాలవెల్లువ కేంద్రంలో పాలు పోసేవారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఎస్ యూనస్, ఏపీఎం మంజునాథ, డీసీసీ బ్యాంకు చైతన్య, సీసీ మహేష్, వీఓఏ శిరీష, పాడిరైతులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో విజిలెన్స్ వారోత్సవాలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీపీపీ విజిలెన్స్ సీఐ జావెద్



ఎర్రగుంట్ల : విద్యార్థి దశ నుంచే నీతిగా ఉండాలని అప్పుడు సమాజం బాగు పడుతుందని ఆర్టీపీపీ విజిలెన్స్ సీఐ జావెద్ తెలిపారు. బుధవారం ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో విజిలెన్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి రహిత భారతదేశం అనే అంశంపై స్కూల్‌లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఉపాధ్యాయుడు

మైదుకూరు : మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ (బాలికల)లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.రాధా నరసింహారాజు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 81 మంది విద్యార్థినులకు 10వ తరగతి పరీక్షల ఫీజును ఆయన చెల్లించారు. పరీక్షల ఫీజు మొత్తం రూ.10,125లను ఉపాధ్యాయుడు బుధవారం పాఠశాల హెడ్మాస్టర్ ఎస్‌జీ భవానిదేవికి అందజేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయుడు రాధా నరసింహారాజు విద్యార్థినులకు పరీక్షల ఫీజు చెల్లించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల (గతంలో కోఎడ్యుకేషన్) రుణం తీర్చుకునేందుకే విద్యార్థినుల ఫీజు చెల్లిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ షామీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మలతో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన అర్హులందరు పథకాల కోసం దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం కచ్చితంగా వారికి పథకాలు వచ్చేవిధంగా చేస్తుందన్నారు. ఇప్పటికే దేశంలో ఎక్కడ లేనివిధంగా 98 శాతం ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు చేయించి మెగా వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. అనారోగ్యంగా ఉన్న వారికి మెరుగైన చికిత్స నిమిత్తం కోసం తిరుపతి, కర్నూల్, విజయవాడ వంటి కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా వారికి వైద్యం చేయించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి పథకాన్ని ప్రవేశపెట్టలేదన్నారు. ప్రజల ఆరోగ్యం బాగుంటే వారు కష్టపడి పనులు చేసుకునే అవకాశం ఉంటుందనే భావనతోనే ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. త్వరలో స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. స్టీల్‌ప్లాంట్ పనులు పూర్తయిన తర్వాత స్థానికులకు 70 శాతం ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పర్యాటక కేంద్రంగా గండికోటను అభివృద్ధి చేసి ఆ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముల్లాజానీ, పోచిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, స్థానిక నాయకులు బుజ్జి, ఎర్రగుడి సుభహాన్ పాల్గొన్నారు.

చిలంకూరులో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల : మండల పరిధి చిలంకూరులోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. చిలంకూరులో గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఇప్పుడు మన సీఎం జగనన్న పాలనలో గ్రామాలలో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. చిలంకూరులో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేయాలని సంబంధిత అధికారలను ఆయన ఆదేశించారు.

పాఠశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచండి



విద్యార్థులతో కలిసి టీవీ ప్రోగ్రాంను తిలకిస్తున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

లింగాల : మండలంలోని గుణకనపల్లె ప్రాథమిక పాఠశాలను బుధవారం సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర్ తనిఖీ చేసి మాట్లాడారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన రాఘవేంద్రమ్మను ఆయన అభినందించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులతో కలిసి టీవీ ప్రోగ్రాంను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నారాయణరెడ్డి, ఎమ్మార్పీ జయచంద్రారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి ఫించన్‌ను అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందివ్వడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ సచివాలయ పరిధిలోని వైఎస్ రాజారెడ్డి కాలనీ, విద్యా మందిరం, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రతి ఒక్కరికి వివరించారు. కొత్తగా మంజూరైన ఫించన్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్లు కోడి రమణ, డేనియల్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఎం గోవర్ధన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపో పరిధిలోని పల్లెవెలుగు బస్సుల్లో కడప–పులివెందుల, పులివెందుల–కడపకు ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్ తీసుకుని దిగేటప్పుడు టిక్కెట్‌లను బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేస్తే 15 రోజులకు ఒకసారి లక్కీడిప్ తీసి విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తారని ఆర్టీసీ డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నూతన ఆర్టీసీ బస్టాండు ఎంక్వైరీ కౌంటర్‌లో ప్రయాణికుల సమక్షంలో లక్కీడిప్ తీస్తామన్నారు. గెలుపొందిన పులివెందులకు చెందిన మేరీ, లక్ష్మిప్రభ, పద్మావతిలకు లక్ష్మివెంకటేశ్వర మెడికల్స్ వారు అందించిన బహుమతులను ప్రధానం అందజేశారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి బహుమతులు గెలుపొందాలన్నారు. అలాగే ఆర్టీసీ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఎంపీటీసీలు అసంతృప్తిగా ఉన్నారనడం అవాస్తవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీలు

వేంపల్లె : మండలంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు అసంతృప్తిగా ఉన్నారని అనడం అవాస్తవమని వేంపల్లె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పచ్చ మీడియా వేంపల్లెలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు అసంతృప్తిగా ఉంటూ కార్యక్రమాలకు దూరంగా ఉందారని రాయడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వారికి ఇళ్లస్థలాలు కేటాయించి ఆకట్టుకుంటున్నారని చెప్పడం అవివేకమన్నారు. ఎంపీటీసీల్లో కొందరు పేదలు ఉన్నారని వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు కేటాయించాలని చెప్పడం వాస్తవమన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రతి క్కరికి అర్హతే ప్రామాణికంగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తారన్నారు. ఎక్కడైనా సరే అవినీతి జరిగిందని నిరూపించాలని సవాల్ విసిరారు. అభివృద్ధి విషయంలో పులివెందుల తర్వాత వేంపల్లెకు కోట్ల రూపాయల నిధులను కేటాయించి అభివృద్ధి చేశారనేది వాస్తవమన్నారు. అడిగిన వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. తాము అందరం కలిసికట్టుగా పనిచేసి వేంపల్లెను మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. పత్రికల్లో వ్రాసే ముందు ఒకసారి విచారించి వ్రాస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, రాజకుమార్, కొండయ్య, భారతి, బాబాషరీఫ్, ఎంహెచ్ హబీబుల్లా, బ్రహ్మయ్య, రహంతుల్లాఖాన్, కోఆప్షన్ మెంబర్ ఆసానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేంపల్లె : స్థానిక శ్రీరామ్ నగర్‌లోని మండల ప్రాథమిక పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. బుధవారం ఈ వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి గుండెజబ్బులతో విచ్చేసిన పేదలకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డిఎకో వంటి అధునాతన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం తీవ్ర వ్యాధిగ్రస్తులను అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రికి మెరుగైన వైద్యచికిత్సల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, కిమ్స్ ఆసుపత్రి మేనేజర్ రామాంజనేయులు, బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ పథకం పనులను పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: అమృత్ ఒకటవ దశ కింద చేపట్టిన పైపులైన్‌లు, ఈఎల్‌ఎస్‌ఆర్ పనులను వెంటనే పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం పలు ప్రాంతాల్లో పైపులైన్లు, ఈఎల్‌ఎస్‌ఆర్ పనులను ఆయన పరిశీలించారు. రిమ్స్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న పైపులైన్ పరిశీలించి, పనులు పూర్తయిన వెంటనే బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. సంజన్న సర్కిల్ వద్ద పైపులైన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ప్రకాష్‌నగర్ ఎస్సీ హాస్టల్ వద్దనున్న ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకు నుంచి డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ పరిశీలించి, ఇంటర్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. ఓంశాంతి నగర్ వద్దనున్న కాలువను పరిశీలించి తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం



పులివెందులలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ చిన్నప్ప, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక పూలఅంగళ్ల సర్కిల్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్, కౌన్సిలరు ఖాదర్‌బాషా, డేనియల్ బాబు, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, ఎస్సీ నాయకులు కృష్ణమూర్తి వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డిలు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన గొప్ప మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన సాధించిన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మార్కెట్‌యార్డులో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీనీ రైతులు, వ్యాపారస్తులు, మార్కెట్‌యార్డు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారత రత్న ఇవ్వాలి



కమలాపురంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు అమరజీవిగా నిలిచిన శ్రీ పొట్టి శ్రీరాములుకు భారత రత్న అవార్డు ఇవ్వాలని పొట్టిశ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డి సురేష్ తెలిపారు. బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోదండ రామాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్ర ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చేయడానికి 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి చివరకు అమరుడయ్యాడని గుర్తు చేశారు. రాష్ట్ర పితగా నిలిచిన పొట్టి శ్రీరాములుకు భారత రత్న ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటరమణయ్య, గ్రేటర్ వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, కోశాధికారి శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బుధవారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో యువత అభివృద్ధి చెందాలంటే అందరికీ వారి శక్తి సామర్థ్యాలకు తగిన ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. కానీ మోడీ ప్రభుత్వం ఇందులో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, నిరుద్యోగ (జెఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్.సిద్దిక్, డీవైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య జిల్లా నాయకులు రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, శ్రీనివాస్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహబూబ్ సుబహాని ఉరుసు



పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబే సుబహాని దర్గా

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబె సుబహాని, ఖుత్‌బే రబ్బాని, అబ్దుల్‌ఖాదర్ జిలాని, దస్తగిర్‌స్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహిస్తున్నట్లు దస్తగిరిస్వామి దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండాను పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలలతో ఊరేగింపు నిర్వహిస్తామని, అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తామన్నారు. అన్నదానం నిర్వహిస్తామని, స్వామి వారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు క్రీడాకారులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో స్టేడియం ఇన్‌చార్జి శేఖర్



త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పులివెందుల టౌన్ : ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అనకాపల్లె జిల్లాలో జరిగే 67వ స్కూల్ గేమ్స్ అండర్–17 రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు పులివెందులకు చెందిన క్రీడాకారులు వి.చందు, డి.సుశాంత్‌లు ఎంపికైనట్లు హాకీ కోచ్ రవికుమార్ తెలిపారు. ఎంపికైన వీరికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, చీఫ్ కోచ్ అమృత్‌రాజ్, పులివెందుల ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి శేఖర్‌లు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్..

జమ్మలమడుగు : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పెద్దముడియం మండలం భీమగుండం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.తిరుపాలు తెలిపారు. అక్టోబర్ 31వ తేదీన అన్నమయ్య జిల్లా నీలకంఠారావు పేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జిల్లాస్థాయి త్రోబాల్‌పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతికి చెందిన మౌనిక, మల్లికలు విశేష ప్రతిభ కనబరచడంతో వారు రాష్ట్రస్థాయిలో జరిగే త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యమైన ఎరువులు అమ్మాలి




సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఈదురుబాషా



హాజరైన డీలర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్స్ డీలర్లు రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అమ్మాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఈదురుబాష అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం కడప కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో అగ్రికల్చర్ అధికారులు, ఫర్టిలైజర్స్ డీలర్లకు, రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజు అని వారు బాగుంటే మనతోపాటు దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అలాంటి రైతులకు ప్రతి ఫర్టిలైజర్ డీలర్లు నాణ్యమైన ఎరువులతోపాటు పురుగుమందులు అమ్మాలన్నారు. నకిలీవి అమ్మితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎక్కడైనా ఎవరైనా కల్తీ ఎరువులుగానీ, నకిలీ పురుగు మందులుగానీ అమ్ముతున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణం మాదృష్టికి తేవాలన్నారు. ఈ విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు మాధవి, సుబ్బారావు, నరసింహారెడ్డి, నాగరాజు, విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ బాలగంగాధర్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, ఆచార్యులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం వీసీ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పోస్టర్లను ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర భవితకు దోహదపడే నూతన, సంప్రదాయేతర ఇంధనాల ఉపయోగాలపై జాతీయ సదస్సును నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, సదస్సు సంచాలకులు ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, సహ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్, సహ ఆచార్యులు డా. టి. చంద్రశేఖర్, డా. రాఘవేందర్, డా. సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

■ యోగివేమన విశ్వవిద్యాలయం పరిపాలన విభాగంలోని డెవలప్‌మెంట్ సెక్షన్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్కాలర్ల ఫెలోషిప్‌ల ఫైళ్లను పరిశీలించారు. ఫైళ్ల నిర్వహణ ఖచ్చితంగా ఉండాలని సూచించారు. ఇటీవల ఉద్యోగులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ సిబ్బందికి ఏమేరకు ఉపయోగపడుతుందో ప్రత్యక్షంగా పరిశీలించారు.